క్లుప్తంగా

నేటి నుంచి యోగా మహోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు యోగా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేఅవుట్‌లోని కమ్యూనిటీ హాల్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, శ్రీరామచంద్రా మిషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సాయంత్ర 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యోగా మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యానంలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. అదే విధంగా 5 నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, అద్భుతమైన పరిజ్ఞానం, గ్రహణశక్తి పెంపు కోసం బ్రెటైర్ మైండ్ అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నం. 9177778233లో సంప్రదించవచ్చన్నారు.

10 నుంచి రేషన్ సరుకుల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: రేషన్ షాపుల్లో ఈనెల 10 తేదీ నుంచి రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి రాథోడ్, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు వైకుంఠం తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవారు తమ సరుకులను తమ ప్రాంతంలోని రేషన్ దుకాణాల్లో తీసుకోవచ్చని వారు అన్నారు.

తాగి గొడవ చేసిన ముగ్గురికి జైలు

చాదర్‌ఘాట్: బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగి గొడవలకు దిగిన ముగ్గురికి నాంపల్లి కోర్టు జైలుశిక్ష విధించింది. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సైదాబాద్ కుర్మగూడకు చెందిన కొయ్యాడ చరణ్ (21), బరిగెల జితిన్ (22), పటేల్ కార్తీక్ (21)లు మలక్‌పేట స్వాగత్ బార్‌లో మద్యం తాగి గొడవ పడ్డారు. అడ్డుకోబోయిన బార్ యజమాని పరుశురామ్‌ను బీర్ బాటిల్‌తో భయభ్రాంతులకు గురి చేశారు. అతని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి వారిని నాంపల్లి 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చగా కోర్టు వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

సైదాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. క్రాంతినగర్ నివాసి ముత్యాల నరేష్ సాఫ్ట్‌వేర్ ఫ్రీలాన్సర్. అతని భార్య రేవతి మంగళవారం సాయంత్రం పిల్లలను ట్యూషన్ సెంటర్ వద్ద దింపి తిరిగి ఇంటికి వచ్చి చూస్తే ఇంట్లో అప్పటి వరకు ఉన్న నరేష్ లేడు. అతడి సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. బుధవారం ఉదయం ఆమె భర్త వాట్సప్‌కు ఎక్కడ ఉన్నావని మెసేజ్ చేయగా.. పది నిమిషాల్లో వస్తానని రిప్లై మెసేజ్ వచ్చింది. తర్వాత భార్య ఎన్నిసార్లు కాల్ చేసినా ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. స్నేహితులు, బంధువులను వాకబు చేసినా భర్త ఆచూకీ తెలియకపోవడంతో రేవతి బుధవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బీజేపీ గెలుపునకు కృషి చేయండి



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత నగరానికి చేరుకున్న కిషన్‌రెడ్డిని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేటర్ అభినందనలు



నాగోలు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన జి.కిషన్‌రెడ్డిని గురువారం కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కలిసి అభినందించారు. బీజేపీ నాయకులు కొత్త తిరుమల్, రాజేష్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 75, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 85, కాకర 55, బీర 40, క్యాబేజీ 16, ఫ్రెంచి బీన్స్ 65–95, క్యారెట్ 50, దొండ 37–55, చిక్కుడు 65–85, గోకర 35.

నాడు సాంస్కృతిక సౌరభం.. నేడు కళాహీనం



అధ్వానంగా మారిన ఆడిటోరియం వేదిక



పిచ్చిమొక్కలతో నిండిన ఆడిటోరియం ప్రాంగణం

- పగుళ్లు తీసిన వేదిక
- చెత్తాచెదారంతో నిండిన ఆవరణ
- ఇదీ వనస్థలిపురంలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం దుస్థితి
- అభివృద్ధి పట్టని హెచ్‌ఎండీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు

వనస్థలిపురం: ఒకప్పుడు సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నేడు శిథిలావస్థకు చేరి కళాహీనంగా మారింది. వనస్థలిపురంలో స్థానికుల అవసరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం హుడా ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆడిటోరియం వేదిక పగుళ్లు ఏర్పడటంతో పాటు ప్రాంగణం అంతా పిచ్చిమొక్కలు, చెత్తా చెదారంతో అధ్వానంగా తయారైంది. దీని అభివృద్ధిపై అటు హెచ్‌ఎండీఏ అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు దృష్టి పెట్టకపోవడంతో ఆడిటోరియం కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంది.

- వనస్థలిపురం నడిబొడ్డున స్థానికుల అవసరాల కోసం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం 1996లో హుడా (ప్రస్తుతం హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మించారు.
- మొదట్లో స్థానికుల అవసరాలకు ఉపయోగపడిన ఆడిటోరియం కాలక్రమేణా నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి నోచుకోకపోవడంతో అధ్వాన స్థితికి చేరింది.
- ఆడిటోరియంను అభివృద్ధి చేయాల్సిన హెచ్‌ఎండీఏ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోకుండా ఆడిటోరియం ఖాళీ స్థలాన్ని వ్యాపార సంస్థలకు అద్దెకు ఇస్తూ కాలం గడుపుతున్నారు.
- ఆడిటోరియం కళావిహీనంగా, వాడుకోవడానికి వీలులేకుండా పోవడంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు, కళాకారులు గత్యంతరం లేక ఆయా గుళ్లలోని వేదికలపై తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు.

ఈ నెలలోనే కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు

వనస్థలిపురం నివాసుల ఫేజ్–1, 2 సంక్షేమ సంఘం ఎన్నికలు ఈ నెల 23న జరుగనున్నాయి. ఎన్నికల్లో గెలుపుకోసం రెండు ప్యానెళ్లకు చెందిన వ్యక్తులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఆడిటోరియంతో పాటు కాలనీ అభివృద్ధికి కృషి చేసేవారికి మాత్రమే ఈసారి కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఎన్నుకుంటామని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే హామీ ఇచ్చారు



ఆడిటోరియం అభివృద్ధి విషయమై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. ఈ విషయమై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల మేనిఫెస్టోలో ఆడిటోరియం అభివృద్ధిని పెట్టడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో హెచ్‌ఎండీఏ నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలోకి దీనిని తీసుకువచ్చి రూ. 15 కోట్లతో కాలనీ వాసుల అవసరాలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం రవీంద్రభారతి నమూనాలో భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

– కె. సంజయ్‌కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి, వనస్థలిపురం సంక్షేమ సంఘం



సన్మానం.. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ను కొలీజియం సిఫార్సు చేసిన సందర్భంగా ఆయనను కలిసి సన్మానిస్తున్న హోం శాఖ జీపీలు సామల రవీందర్, రూపేందర్, ఏజీపీలు శశిధర్‌రెడ్డి, విశ్వేశ్వర్, సాయి, లియాక్ ఉన్నీస్సా తదితరులు. – సాక్షి, సిటీబ్యూరో

గుడిలో చోరీకి వెళ్లి చిక్కాడు!



పట్టుబడ్డ షేక్ మన్సూర్

హస్తినాపురం: సాయిబాబా గుడిలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణం బర్లపెంట బజార్‌కు చెందిన షేక్ మన్సూర్(45) నగరంలో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ ఇతను అవసరమైన డబ్బుల కోసం చోరీల బాటపట్టాడు. పోలీసస్టేషన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో చోరీ చేసేందుకు గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు ప్రవేశించాడు. గమనించిన స్థానికులు మన్సూర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో చోరీ చేసేందుకు ఆలయంలోకి వెళ్లానని నిందితుడు ఒప్పుకున్నాడు. ఆలయ క్లర్క్ సూర్యనారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మన్సూర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భార్య, బంధువులు తిట్టారని న్యాయవాది ఆత్మహత్యాయత్నం

చైతన్యపురి: భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు తిట్టి అవమానపర్చారని మనస్తాపంతో ఓ న్యాయవాది ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుడి సోదరుడు తెలిపిన వివరాలు... సరూర్‌నగర్ బృందావన్ కాలనీ రోడ్ నంబర్–9లో నివసించే కొరుపల్లి సుభాష్ (40) న్యాయవాది. కొన్నాళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో శిరీష భర్త ఇంటి నుంచి వెళ్లిపోయింది. విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. ఇలా ఉండగా, బుధవారం సాయంత్రం సరూర్‌నగర్ మున్సిపల్ కాలనీకి వచ్చిన భార్య శిరీష, మామ మల్లేష్, బావమరిది మణికంఠ మాట్లాడేది ఉంది రమ్మని సుభాష్‌ను పిలిచారు. అక్కడకు వెళ్లిన సుభాష్‌ను భార్య దుర్భాషలాడుతూ చెప్పుతో కొట్టింది. అంతేకాక మామ, బావమరిది అవమానకరంగా మాట్లాడుతూ తప్పుడు కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతో ఇంటికి ఏడ్చుకుంటూ వచ్చిన సుభాష్ జరిగిన ఘటనను సోదరుడు వినోద్‌కు చెప్పగా, పిలిపించి మాట్లాడదామని సముదాయించాడు. గురువారం ఉదయం తమ్ముడు గది నుంచి ఎంతకీ రాకపోవటంతో వినోద్ వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం చైతన్యపురిలోని సప్తగిరి ఆసుపత్రికి తరలించారు. కాగా, తన సోదరుడిని భార్య శిరీష, మామ, బావమరిది తిట్టి అవమానించడం వల్లే ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని పోలీసులకు వినోద్ ఫిర్యాదు చేశాడు. పూర్తి విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీబాటలో పాల్గొన్న పెద్దవూర బ్రహ్మయ్య తదితరులు

నాగోలు: రజకుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గాడ్గే రజక సంఘం పని చేస్తుందని తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. కొత్తపేట మోహన్ నగర్ మారుతి నగర్ శృంగేరి కాలనీ, జనప్రియ కాలనీలలో తెలంగాణ గాడ్గే రజక సంఘం ఆధ్వర్యంలో రజకుల సమస్యలపై పోరాటానికై బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకూ వెళ్లి రజకుల సమస్యలను తెలుసుకున్నారు. కొత్తపేట మహిళా భవన్ నిర్వహించిన సమావేశంలో రజకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ బాటలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని పెద్దవూర బ్రహ్మయ్య హామీ ఇచ్చారు. రజకుల సమస్యల పరిష్కారం కోసం మరో ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వాడినాల మడేల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పున్నం రాములు, గ్రేటర్ గౌరవాధ్యక్షుడు మల్లేష్ ,గ్రేటర్ అధ్యక్షుడు పగడాల లక్ష్మణ్, గ్రేటర్ కన్వీనర్ జూపల్లి రామకృష్ణ, సంఘం నాయకులు సాయి, రాజేష్, లక్ష్మణ్, అరుణ్, సంతోష్, సైదులు, వెంకటేష్ సత్యనారాయణ, సైదులు, తిరుపతయ్య, రాములు, అవినాష్ ,శ్రీను పాల్గొన్నారు.

రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల అందజేత



ఫిర్యాదుదారులకు మొబైల్ ఫోన్లు అందిస్తున్న సీఐ జానయ్య

చంచల్‌గూడ: చోరీకి గురైన మొబైల్ ఫోన్లతో పాటు వివిధ కారణాల వల్ల పోగొట్టుకున్న ఫోన్లను వాటి యజమానులకు మాదన్నపేట పోలీసులు తిరిగి అందజేశారు. బాధితులు టెలికం శాఖకు చెందిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఫోన్ల ఆచూకీ కొనుగొన్నారు. గురువారం మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో సీఐ జానయ్య 9 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి వాటి యజమానులకు అందజేశారు. రద్దీ ప్రాంతంలో జేబుదొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

జలమా...గరళమా?



బాటిల్‌లో పట్టిన కలుషిత నీటిని చూపిస్తున్న స్థానికులు

చంచల్‌గూడ: తాగునీటి సరఫరాలో వాటర్ వర్క్స్ శాఖ పర్యవేక్షణ కరువైందని కుర్మగూడ బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 3 రోజులుగా బస్తీలో మంచినీరుతో పాటు మట్టి కూడా సరఫరా అవుతోందని తెలిపారు. కుర్మగూడలో వాటర్ వర్క్స్ సిబ్బంది ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా మట్టితో కూడిన నీరు సరఫరా అవుతోందని వారు చెప్పారు. గురువారం వారు మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్‌కు తమ బస్తీకి సరఫరా అయిన కలుషిత నీటిని బాటిల్ పట్టి చూపించారు. కుర్మగూడలో మురుగు నీరు సరఫరా కాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సహదేవ్‌యాదవ్ కోరారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి: సామ



యశోధర కాలనీలో మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తున్న సామ రంగారెడ్డి

వనస్థలిపురం: కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం వనస్థలిపురం డివిజన్‌లోని యశోధర కాలనీ, శ్రీకృష్ణానగర్ కాలనీ, ఓంకార్‌నగర్, శక్తినగర్ కాలనీలలో పాదయాత్ర చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. యశోదర కాలనీలో డ్రైనేజీ, వరద, మంచినీటి సమస్యలు ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యేకు ప్రజల క్షేమం పట్టడం లేదన్నారు. కనీస వసతులు కల్పించని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్, వాసు చౌదరి, అశోక్‌కుమార్, కృష్ణవేణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి బదిలీ



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్–4 డీసీ సురేందర్‌రెడ్డి నార్సింగ్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న కమిషనర్ సత్యబాబును గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సురేందర్‌రెడ్డి శుక్రవారం నార్సింగ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. కాగా, బదిలీ నేపథ్యంలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, రెండున్నరేళ్ల పాటు ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీగా పని చేశానని, అందరి సహకారంతో సర్కిల్‌లోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేశామని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేశానన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మూడుచక్రాల సైకిల్ వితరణ

చైతన్యపురి: మొగుళ్లపల్లి యువసేన సభ్యుడు సురిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చైతన్యపురి మున్సిపల్ కాలనీకి చెందిన అంగ వికలాంగుడు మహేష్‌కు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో భాగంగా యువసేన ఆధ్వర్యంలో వికలాంగ జంటకు ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామని, పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు, యూనిఫారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చొప్పవరపు పవన్, శ్రవణ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ నాలాలకు ఎయిర్ జంక్షన్లు ఏర్పాటు చేయాలి

మన్సూరాబాద్: బాక్స్ టైప్ నాలాలను నిర్మించేటప్పుడు ఎయిర్ జంక్షన్లు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. మన్సూరాబాద్ డివిజన్‌లో జరుగుతున్న బాక్స్‌టైప్ నాలా పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, దుర్వాసన వస్తుందని నాలాల మ్యాన్‌హోళ్లను సిమెంట్‌తో పూర్తిగా మూసి వేస్తుండటంతో గ్యాస్ పెరిగిపోయి ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. కామినేని మన్సూరాబాద్ ప్రధానరోడ్డు ఆయిల్‌మిల్లు వద్ద, మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద, సరస్వతినగర్‌కాలనీలో ఎయిర్ జెంక్షన్లు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రతి రక్తపు చుక్క నిండు ప్రాణానికి భరోసా

ఎల్‌బీనగర్: దాతలు అందించే ప్రతీ రక్తపు చుక్క ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి నిండు ప్రాణానికి భరోసాగా నిలుస్తుందని జీబీ ఇన్‌ఫ్రా గ్రూప్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘ భవనంలో జీబీ ఇన్‌ఫ్రా గ్రూప్ మార్కెటింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతల నుంచి 150 యూనిట్ల రక్తాన్ని సేకరించి చిరంజీవి రక్తనిధికి అందజేశారు. మార్కెటింగ్ సభ్యులు కోటేశ్వరరెడ్డి, లింగయ్య, నీలకంఠం , సురేందర్, యాదయ్య. ప్రవీణ్‌గౌడ్, నాగచందర్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్‌లో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ (బీజేఆర్) వర్ధంతి సందర్భంగా గురువారం ఆయనకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, దళిత, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. ఎల్బీనగర్/ మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో బీజేఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలు వేసి అంజలి ఘటించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



మూసారంబాగ్‌లో... కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు



కొత్తపేట బీజేఆర్ భవన్‌లో.. కాంగ్రెస్‌నేత దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

త్వరగా నాలా పనులు పూర్తి చేయండి

నాగోలు: వర్షాకాలం ప్రారంభమైనా ఇంకా ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పూర్తి కాలేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ అన్నారు. గురువారం నాగోలు డివిజన్ పరిధిలో జరుగుతున్న నాలా డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నాలా పనులను మధ్యలోనే వదిలేయడం వల్ల కాలనీవాసులు చాలా ఇబ్బంది పడుతున్నారనే ధ్యాస అధికారులకు లేకుండాపోయిందన్నారు. ఇప్పటికైనా నాలా పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆమె కోరారు.

స్థానికంగానే సమస్యలకు సత్వర పరిష్కారం

వార్డు ఆఫీసుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



చైతన్యపురి వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు కార్యాలయాలు తోడ్పడతాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ వార్డు కార్యాలయాన్ని స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల్లోని సమస్యలను కాలనీకి దూరంగా ఉండే జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలకు వెళ్లి అధికారుల దృష్టికి వీలుకాదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొనే ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోనే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసిందని, దీంతో స్థానికంగా సమస్యలకు సత్వర పరిష్కారం లభించనున్నదని ఎమ్మెల్యే చెప్పారు. దాదాపు 11 విభాగాల అధికారులు వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పచ్చదనం, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై ప్రజలను చైతన్యపర్చడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ రహదారులు, డ్రైనేజీ నాలాలను శుభ్రం చేయాలని, పాఠశాలలు, కార్యాలయాల పరిశుభ్రతకు తగు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఒకరోజు కేటాయించాలని అధికారులకు సూచించారు.

చైతన్యపురిలో.....

చైతన్యపురి డివిజన్ వార్డు కార్యాలయాన్ని స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌తో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, స్థానిక సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయ సిబ్బంది మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, నాయకులు తోట మహేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, శరత్‌చంద్ర, వినోద్ యాదవ్, రుద్రారపు శంకర్, కృష్ణప్రకాష్, జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.